# ఆత్మావలోకనం

## దేవిక అండ్ డానీ


ఓటీటీ హిట్

**జియో+ హాట్‌స్టార్ :** స్ట్రీమింగ్ అవుతున్నది
**తారాగణం :** రీతూ వర్మ, సూర్య వశిష్ట, సుబ్బరాజు, కోవై సరళ, సోనియా సింగ్, శివ కందుకూరి తదితరులు, **దర్శకత్వం :** బి.కిషోర్

కొందరంతే.. కంఫర్ట్ జోన్‌లోనే కాలం గడుపుతుంటారు. భూగోళం బద్దలైనా.. ఆ బాక్స్ దాటి బయటికి రారు. అలా.. ఇంటినే కంఫర్ట్ జోన్‌గా భావించి బతికే అమ్మాయి కథే.. 'దేవిక అండ్ డానీ'. అయితే, అనుకోని పరిస్థితుల్లో ధైర్యంగా మరో ప్రపంచంలోకి అడుగుపెట్టి.. తనను




తాను కొత్తగా ఆవిష్కరించుకుంటుంది. కామెడీ, హారర్, రొమాంటిక్, భావోద్వేగ అంశాలతో మొత్తం ఏడు ఏపిసోడ్లుగా రూపొందిన తెలుగు వెబ్‌సిరీస్ ఇది.
ఆంధ్రప్రదేశ్‌లోని రామాపురం అనే పల్లెలో.. ఈ కథ మొదలవుతుంది. దేవిక (రీతూ వర్మ) ఓ పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా పనిచేస్తుంటుంది. చాలా నెమ్మదస్తురాలు. ఇల్లే ప్రపంచం. జగన్నాథం అలియాస్ జగ్గీ (సుబ్బరాజు) చాలా పొసెసివ్‌గా ఉంటాడు. తన ప్రవర్తనతో దేవికతోపాటు చుట్టుపక్కల వారినీ ఇబ్బంది పెడుతుంటాడు. తండ్రి మాట జవదాటని దేవిక.. జగ్గీతో పెళ్లికి సిద్ధమవుతుంది. అదే సమయంలో.. ఊహించని విధంగా ఆమె జీవితంలోకి డానీ (సూర్య వశిష్ట) అనే ఒక అజ్ఞాతవ్యక్తి వస్తాడు. అనతి కాలంలోనే ఇద్దరి మధ్య అనుబంధం ఏర్పడుతుంది. జగ్గీ, డానీ.. ఇద్దరిలో ఎవరిని పెళ్లి చేసుకోవాలనే సందిగ్ధంలో పడిన దేవికకు.. మరో ట్విస్ట్ ఎదురవుతుంది. ఆ ట్విస్ట్ ఏంటి? దానివల్ల దేవిక జీవితంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయి? అసలు డానీ ఎవరు? అతని గతం ఏమిటి? అతను దేవికను ఏ సహాయం చేయమని కోరుతాడు? ఆ సహాయం చేసే క్రమంలో దేవికకు ఎదురైన సవాళ్లేంటి? వాటిని దాటుకొని.. దేవిక అనుకున్నది సాధించిందా? అనే ఆసక్తికర అంశాలతో ఈ సిరీస్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది.



వెండితెర అమ్మ దయామయి. కరుణాంతరంగిణి.
అదే సిల్వర్ స్క్రీన్‌పై నాన్న నవరసాలు ఒలికించాడు.
అమ్మ విషయంలో ఆచితూచి స్క్రిప్టులు రాసుకున్న సినీజనాలు.
అవకాశం కుదిరినప్పుడల్లా నాన్న పాత్రతో ఆటాడుకున్నారు.
నాన్నను హీరోను చేశారు, విలన్‌గా చూపించారు. నాన్నతో హాస్యం
పండించారు, కరుణ రసం ఒలికించారు. మొత్తంగా
నాన్న క్యారెక్టర్‌ని గట్టిగానే వాడుకున్నారు.
కాలం మారే కొద్దీ నాన్న పరిధిని మరింత పెంచేశారు.
ఫాదర్స్ డే సందర్భంగా వెండితెర
తండ్రులను గుర్తుచేసుకుందాం..


నమస్తే తెలంగాణ
# జిందగీ
ఆదివారం | 15 జూన్ 2025
హైదరాబాద్ | www.ntnews.com



## డిఫరెంట్ నాన్నలు

**తండ్రి** పాత్రకు వన్నెలు దిద్దిన నటులు కొందరు. అందులో ఒకరు సీఎస్సార్ ఆంజనేయులు. పాతాళభైరవిలో రాకుమారి తండ్రిగా ఆయన అద్భుతమైన నటనను ప్రదర్శించాడు. 'అప్పు చేసి పప్పుకూడు'లో కన్నింగ్ ఫాదర్‌గా మెస్మరైజ్ చేశాడు సీఎస్సార్. డిఫరెంట్ ఫాదర్ కేటగిరిలో వచ్చే మరో నటుడు రేలంగి. అద్భుతమైన టైమింగ్‌తో కామెడీ పండించే రేలంగి వందల సినిమాల్లో తండ్రిగా కనిపించాడు. 'ప్రేమించి చూడు', 'ఆత్మీయులు', 'రాము' చిత్రాలు రేలంగిని డిఫరెంట్ నాన్నగా చూపించాయి. ధూళిపాళ, ముక్కామల, మిక్కిలినేని కూడా గుర్తుండిపోయే తండ్రి పాత్రలు పోషించారు. డిఫరెంట్ ఫాదర్ కేటగిరిలో కనిపించే నటులు నూతన్ ప్రసాద్, గొల్లపూడి, తనికెళ్ల భరణి. అవకాశం వచ్చిన ప్రతిసారీ తండ్రి గ్రాఫ్‌ను అమాంతం పెంచేసినవారే వీరంతా!

# బాధ్యతలు.. భావోద్వేగాలు!


**భా**రతీయ సినీచరిత్రలో కరణ్ జోహార్‌ది ప్రత్యేక స్థానం. దర్శకుడిగా, నటుడిగా, నిర్మాతగా, వ్యాఖ్యాతగా ఆయన ప్రస్థానం అసామాన్యం. 'తండ్రి'గానూ.. ఆయన ప్రయాణం ఎంతో విభిన్నం. సరోగసి ద్వారా కవలలకు జన్మనిచ్చిన కరణ్.. 'ఫాదర్స్‌డే' సందర్భంగా తన పాడ్‌కాస్ట్‌లో ఓ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాడు. ఆధునిక పేరెంటింగ్, కుటుంబ వ్యవస్థ, పిల్లలను పెంచడంలో ఉండే బాధ్యతలు, భావోద్వేగాలను ఈ సింగిల్ ఫాదర్ తన అభిమానులతో పంచుకున్నాడు. తన కవలలు యష్-రూహి.. తాము ఎలా పుట్టామని అడిగితే.. 'మీరు నాన్న గుండెలోంచి వచ్చారు' అని కవితాత్మకంగా చెబుతాడట. అయితే, వాళ్లు పెద్దయ్యాక ఈ సమాధానం సరిపోదనీ, వాళ్లు ఈ ప్రపంచంలోకి ఎలా వచ్చారో, సమయం వచ్చినప్పుడు తప్పకుండా చెబుతానని అంటున్నాడు. పేరెంటింగ్ అంటే నిజం చెప్పడం.. నిజాయతీగా ఉండటం అంటున్నాడు. ఇక పిల్లలను తన తల్లి సంరక్షణలో పెంచడం.. తన జీవితంలో తీసుకున్న అత్యుత్తమ నిర్ణయమని చెబుతున్నాడు. ''ఒంటరి తండ్రిగా కవలలను పెంచడం అంత సులభం కాదు. కానీ, వారిని మా అమ్మ దగ్గర పెంచడం నా జీవితంలో నేను తీసుకున్న ఉత్తమ నిర్ణయం'' అని కరణ్ జోహార్ చెప్పుకొచ్చాడు. ఇక కుటుంబ వ్యవస్థ గురించి తన అభిప్రాయాలను పంచుకుంటూ.. ''అందరూ పరిపూర్ణ కుటుంబంలోనే పుట్టలేరు. కానీ, కొందరు అదృష్టవంతులు మాత్రమే సంపూర్ణ కుటుంబాన్ని నిర్మించుకుంటారు. నేనుకూడా అలాంటి అదృష్టవంతుణ్నే అని భావిస్తున్నా! గౌరీ ఖాన్, ఫరాఖాన్, నేహా ధూపియా, శ్వేతా బచ్చన్, కాజల్ ఆనంద్.. ఇలా నా స్నేహితులంతా నా కుటుంబసభ్యులే! నాకు తోబుట్టువులు లేరు. వీళ్లే నాకు దొరికిన తోబుట్టువులు!'' అంటూ భావోద్వేగానికి గురయ్యాడు. తన పిల్లలకు 'తల్లి ప్రేమ'కు దూరంగా ఉంటున్నామనే ఊహకూడా రాదనీ, వారిపై తన తల్లితోపాటు తన మిత్రబృందం కూడా అంతులేని ప్రేమను కురిపిస్తుందని అంటున్నాడు. ఇక సినిమాల విషయానికి వస్తే.. బీటౌన్‌కు సరికొత్త ప్రేమకథా చిత్రాలను పరిచయం చేశాడు కరణ్. షారుక్ ఖాన్, కాజల్ జంటగా.. 1998లో వచ్చిన 'కుచ్ కుచ్ హోతా హై' దర్శకుడిగా కరణ్ మొదటి సినిమా. ఆ తర్వాత కభీ ఖుషి కభీ గమ్, మై నేమ్‌ఈజ్ ఖాన్, స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్, బాంబే టాకీస్, ఘోస్ట్ స్టోరీస్ వంటి అనేక విజయవంతమైన చిత్రాలను ఆయన తెరకెక్కించాడు.



# సీక్వెల్‌ను ఊహించలేను..

**బా**లీవుడ్ ఐకానిక్ చిత్రం.. దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే! ఈ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచన ఏమాత్రం లేదని అంటున్నది అగ్రతార కాజోల్. రాజ్-సిమ్రన్ కథను కొనసాగించకపోవడమే మంచిదని అంటున్నది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కాజోల్.. 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే' సినిమా సీక్వెల్‌పై తన అభిప్రాయాన్ని పంచుకున్నది. ''డీడీఎల్‌జే-2ని ఊహించలేను. రైల్వే స్టేషన్ నుంచి రైలు బయల్దేరిన తర్వాత ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఎవరూ ఉత్సాహం చూపించడం లేదు. రాజ్-సిమ్రన్.. తమ పిల్లల డైపర్ల కోసం గొడవ పడటం కూడా చూడాలని అనుకోవడం లేదు. అందుకే.. మేము కూడా ఈ ఐకానిక్ సినిమాకు సీక్వెల్‌ను తీసుకురావాలని అనుకోవడం లేదు'' అంటూ చెప్పుకొచ్చింది. ''నిజానికి.. ఆ సినిమా క్లయిమాక్స్ అద్భుతంగా ఉంటుంది. ఆ ప్రేమజంట జీవితం ఎలా ఉంటుందో.. ప్రేక్షకుల ఊహకే వదిలేశాడు దర్శకుడు. ప్రేక్షకులు కూడా.. వాళ్లు ఎప్పటికీ సంతోషంగా జీవిస్తారనే కోరుకుంటారు'' అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించింది. ఇక తాను షారుక్‌తో కలిసి నటించిన మరో బ్లాక్‌బస్టర్ సినిమా.. 'కుచ్ కుచ్ హోతా హై' సీక్వెల్‌పైనా స్పందించింది. ''ఆకాలం వేరు. ప్రజలంతా శాశ్వతమైన ప్రేమను నమ్మిన యుగం అది. నేటికాలంలో అలాంటి సినిమాను తిరిగి సృష్టించడం చాలా కష్టం'' అని చెప్పింది. షారుక్ ఖాన్ - కాజోల్ జంటగా 1995లో వచ్చిన దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే సినిమా.. బాలీవుడ్ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీల్లో ఒకటిగా నిలిచింది. రన్నింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులు సృష్టించింది. 1995 అక్టోబర్ 20న విడుదలైన ఈ చిత్రం.. ముంబైలోని 'మరాఠా మందిర్ థియేటర్'లో ఇప్పటికీ ప్రదర్శితమవుతూనే ఉండటం విశేషం! ప్రఖ్యాత దర్శక నిర్మాత యశ్ చోప్రా తనయుడు ఆదిత్య చోప్రా ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. ఇక కాజోల్ సినిమాల విషయానికి వస్తే.. ఆమె నటించిన హర్రర్ చిత్రం 'మా' విడుదలకు సిద్ధంగా ఉంది. విశాల్ ఫురియా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కాజోల్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. రోనిత్ రాయ్, ఇంద్రనీల్ సేన్‌గుప్తా, ఖేరిన్ శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





# నవరస భరితం నాన్న ప్రయనం

**వెండి**తెరపై కరుణ రసం పండించే తండ్రి పాత్ర అనగానే గుర్తొచ్చే పేరు నాగయ్య. తెలుగు సినిమా తొలిరోజుల్లో హీరోగా అలరించిన ఆయన.. తర్వాత తండ్రి పాత్రకు కేరాఫ్‌గా నిలిచారు. సినిమా ఏదైనా.. తండ్రి పాత్రలో ఆయనే తళుక్కుమనేవారు. నాగయ్య ఇండస్ట్రీలో ఉండగానే తండ్రి పాత్రకు కేరాఫ్‌గా నిలిచిన నటుడు గుమ్మడి. ఆయన నటించిన సినిమాల్లో సింహభాగం తండ్రిగానే కనిపించాడు. అడపాదడపా విలనిజం పండించినా.. తండ్రి క్యారెక్టర్‌కు డెఫినిషన్ ఇచ్చింది మాత్రం ఆయనే అనుకోవచ్చు. పిల్లలను బుజ్జగించే తండ్రిగా ఎంత గొప్పగా నటించేవాడో, 'అంతస్తులు' సినిమాలో స్ట్రిక్ట్ ఫాదర్‌గా అంతగా జీవించాడాయన. గుమ్మడి తర్వాత ఆ తరహా ఫాదర్‌హుడ్‌ను టాలీవుడ్‌లో పండించిన నటుడు ప్రభాకర రెడ్డి. బీద తండ్రిగా ఆయన చూపించిన అభినయం 70, 80లలో ట్రెండ్ సెట్టర్ అయింది. కథలో తండ్రి పాత్ర మంచితనానికి మారుపేరుగా ఉంటే చాలు.. దర్శకులు ప్రభాకర రెడ్డిని సంప్రదించేవారు. గుమ్మడి తర్వాత తండ్రి పాత్రకు న్యాయం చేసిన నటుడిగా పేరు పొందాడు.

**వెండితెర** దిగ్గజం ఎస్వీ రంగారావు తండ్రి పాత్రలు ఎన్నో చేశాడు. అయితే, కేవలం సెంటిమెంట్‌కే పరిమితం కాలేదు ఆయన. 'మిస్సమ్మ', 'గుండమ్మ కథ', 'దేవదాసు' సినిమాల్లో ఓ మోస్తరు తండ్రిగా కనిపించే ఆయన 'దక్షయజ్ఞం'లో నట విశ్వరూపం చూపించాడు. ఇక ఆయన విలనిజం పండిస్తూనే, తండ్రిగా పతాక స్థాయిలో కరుణ కురిపించిన సినిమా 'భక్త ప్రహ్లాద'. శ్రీహరిని కీర్తిస్తున్న తన కొడుకును దండించే క్రమంలో ఆయన చూపిన క్రౌర్యం, కన్నకొడుకును దూరం చేసుకుంటున్నానే అని తండ్రిగా పడే ఆవేదన రెండు భావాలనూ రెండు కండ్లతో పలికించాడు. 'శాంతినివాసం'లో దారితప్పిన బిడ్డలను చక్కదిద్దిన తండ్రి పాత్రలో ఎస్వీ రంగారావు చూపించిన నటన అనితర సాధ్యం అనిపిస్తుంది.

**నాన్నతో** విలనీ క్యారెక్టర్ అనగానే కండ్ల ముందు కదలాడే నటుడు నాగభూషణమే! డైరెక్ట్ విలన్ క్యారెక్టర్ల కన్నా.. దుష్ట తండ్రి పాత్రల్లోనే ఎక్కువగా కనిపించాడాయన! తన పిల్లల విషయంలో బాధ్యతగా మెలిగే ఆ పాత్ర.. డెన్‌లోకి వెళ్లగానే ఒక్కసారిగా మారిపోతూ కనిపిస్తుంటుంది. ఇలాంటి సినిమాలు బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో ఎన్నెన్నో వచ్చాయి. వాటిలో సింహభాగం నాగభూషణమే అలరించాడు. వెండితెరపై నవరస నట సార్వభౌముడిగా కీర్తి గడించిన కైకాల సత్యనారాయణ గుడ్ ఫాదర్‌గా, బ్యాడ్ ఫాదర్‌గా ఎన్నో సినిమాలు చేశాడు. కరుణ రసం పండించడంలో కైకాల తర్వాతే ఎవరైనా అన్న పేరు తెచ్చుకున్నాడు. రిచ్ ఫాదర్‌గా, కామెడీ ఫాదర్‌గా, నిరుపేద తండ్రిగా, మధ్యతరగతి నాన్నగా ఆయన వేయని తండ్రి పాత్ర లేదు. అన్ని పాత్రలకూ వంద శాతం న్యాయం చేశాడు. విలనిజానికి నిజమైన భాష్యం చెబుతూ, తండ్రి పాత్రను రక్తికట్టించిన నటుడు రావు గోపాలరావు. మంచి నాన్నగానూ రావు గోపాలరావుకు గొప్ప ట్రాక్ రికార్డు ఉంది. ఆ తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న రావు రమేశ్ ఇప్పుడు గుడ్ ఫాదర్‌గా ఈ తరానికి దగ్గరయ్యాడు. ఆయన చేస్తున్న ప్రతి నాలుగు సినిమాల్లో మూడైనా తండ్రి పాత్రలే ఉంటుండటం విశేషం.

**తండ్రి** పాత్రకు పెట్టని కోట లాంటి నటుడు కోట శ్రీనివాసరావు. ఏ తరహా పాత్రనైనా అలవోకగా పండించే ఆయన.. తండ్రి పాత్రకు కొత్త నిర్వచనం చెప్పాడు. కొన్ని సినిమాల్లో విలన్‌గా కనిపిస్తూనే.. తండ్రి పాత్రకు తగిన న్యాయం చేశాడు. ఇలాంటి తండ్రి ఎవరికీ ఉండొద్దు అన్న క్యారెక్టర్లు చేశాడు, తండ్రంటే ఇలా ఉండాలన్న పాత్రలూ పోషించాడు. ఏది చేసినా.. ప్రేక్షకులు గొప్పగా ఆదరించేలా అదరగొట్టడం కోట స్టైల్. 'ఆహ నా పెళ్లంట' సినిమాలో పీనాసి తండ్రిగా వంద మార్కులు గెలుచుకున్నాడు. 'మామగారు' సినిమాలో చిల్లర నాన్నగా అలరించాడు. 'ఆమె' చిత్రంలో భయపెట్టాడు. 'మా నాన్నకు పెళ్లి', 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు' సినిమాల్లో లవ్లీ ఫాదర్‌గా దగ్గరయ్యాడు. 'ఇడియట్' చిత్రంలో గుడ్ ఫాదర్‌గా మార్కులు కొట్టేశాడు. 'ఆడువారి మాటలకు అర్థాలు వేరులే' అయితే నాన్నతనానికి నిర్వచనమే చెప్పేశాడు. మొత్తంగా కోట శ్రీనివాసరావు తండ్రి పాత్రలకు చెరగని చిరునామాగా నిలిచాడు. తండ్రి పాత్రలో ఒక్కో నటుడూ ఒక్కో రసం పండిస్తే.. ఆ పాత్రలోనే నవరసాలు పలికించిన నటుడు అనిపించుకున్నాడు కోట.


**కథను** మలుపుతిప్పే తండ్రి పాత్రల్లో ఎవరైతే బాగా చేస్తారని ఇండస్ట్రీ ఆలోచిస్తున్న తరుణంలో ప్రకాశ్‌రాజ్ లైమ్‌లైట్‌లోకి వచ్చాడు. కోట తర్వాత వైవిధ్యమైన నాన్న పాత్రలతో క్రేజీ సంపాదించాడు. 'నువ్వే.. నువ్వే..', 'నువ్వు నాకు నచ్చావ్', 'అశోక్', 'ఆకాశమంత' తదితర సినిమాలతో తండ్రి పాత్రకు దిశానిర్దేశం చేశాడు ప్రకాశ్‌రాజ్. 'బొమ్మరిల్లు' సినిమా మరింత ప్రత్యేకం. బిడ్డల బాగు కోసం తపన పడే తండ్రిగా ఆయన నటన అదుర్స్ అనిపిస్తుంది. ఆ చిత్రం చివర్లో తన అభిమానం, క్రమశిక్షణ కారణంగా పిల్లలు ఏం మిస్ అవుతున్నారో తెలిసి.. మదనపడే సన్నివేశంలో ప్రకాశ్‌రాజ్ సిసలైన తండ్రి అనిపించుకున్నాడు. ఈ సినిమా విడుదలయ్యాక కాస్త స్ట్రిక్ట్‌గా ఉన్న తండ్రులందరూ 'బొమ్మరిల్లు ఫాదర్' అన్న కితాబు దక్కించుకున్నారు.

**సెకండ్** ఇన్నింగ్స్ మొదలుపెట్టిన చాలా మంది నటులకు తండ్రి పాత్ర ఊతకర్రలా మారింది. ఒకప్పుడు హీరోలుగా అలరించిన చాలామంది రీ ఎంట్రీలో తండ్రులుగా ఎదుగుతున్నారు. వారిలో పక్క ఇండస్ట్రీ హీరోలూ ఉండటం విశేషం. సీనియర్ నరేశ్, రాజేంద్రప్రసాద్, జగపతిబాబు, అర్జున్, సుమన్, సాయికుమార్, సత్యరాజ్ తదితరులు యంగ్ హీరోహీరోయిన్లకు తండ్రులుగా సక్సెస్ సాధిస్తున్నారు. నరేశ్ కామెడీ టైమింగ్‌తో అలరిస్తుంటే.. రాజేంద్రప్రసాద్ తన అనుభవంతో పాత్రను పండిస్తున్నాడు. జగపతిబాబు మంచి తండ్రిగా, బ్యాడ్ విలన్‌గా రెండు పార్శ్వాలూ చూపిస్తున్నాడు. మొత్తంగా వెండితెరపై నాన్న పాత్ర సినిమాకు దన్నుగా నిలబడిందనే చెప్పాలి!

**హ్యాపీ ఫాదర్స్ డే!!**

## "స్టార్ ఫాదర్స్"

**తెలుగు** సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టులే ఎక్కువగా తండ్రి పాత్రలు పోషించారు. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రభాస్ జమానా వరకు తండ్రి స్టార్‌డమ్‌లో ఉన్నప్పుడు తండ్రి పాత్ర పోషించిన స్టార్ హీరోలు తక్కువనే చెప్పాలి. పాత రోజుల్లో అయినా కథ డిమాండ్ చేస్తే ఎన్టీఆర్, ఏయన్నార్ కొన్నిసార్లు తండ్రి పాత్రలు పోషించారు కానీ, ఆ తర్వాత జనరేషన్‌లో శోభన్‌బాబు యంగ్ ఫాదర్‌గా అలరించాడు. చిరంజీవి శకానికి వస్తే.. పెద్ద హీరోలు అతికొద్ది చిత్రాల్లో తండ్రిగా కనిపించారు. స్నేహం కోసం, డాడీ సినిమాల్లో ఫక్తు ఫాదర్ క్యారెక్టర్ వేశాడు చిరు. ఈ విషయంలో వెంకటేశ్ కాస్త ఎక్కువ చొరవ చూపించాడనే చెప్పాలి. 'దృశ్యం', 'దృశ్యం 2', 'నారప్ప' సినిమాల్లో నాన్న పాత్రను ఆకాశమంత పెంచాడు. ఆ తర్వాతి జనరేషన్‌లో కాస్త డిఫరెంట్ స్టోరీ లైన్ ఉంటే తప్ప తండ్రిగా నటించడానికి యంగ్ హీరోలు అంగీకరించడం లేదు. ఈ విషయంలో నాని కాస్త ముందున్నాడు. 'జెర్సీ', 'హాయ్ నాన్న' సినిమాలో భారమైన తండ్రిగా భావోద్వేగాలను పండించాడు ఈ నేచురల్ స్టార్.



# వర్షం.. భయం!
## ఓంబ్రోఫోబియా

**చిరుజల్లులకు ప్రకృతే కాదు.. మన మనసూ పులకిస్తుంది. ఆ ఆహ్లాదకర వాతావరణంలో ఆనందం వెల్లివిరుస్తుంది. కానీ, కొందరిలో మాత్రం.. వర్షం చెప్పలేని భయాన్ని కలిగిస్తుంది. ఆకాశంలో ఉరుము ఉరిమితే.. వీళ్ల గుండెల్లో పిడుగు పడుతుంది. ఆ భయానికే.. ఓంబ్రోఫోబియా అని పేరు. భారీ వర్షాలకే కాదు.. తేలికపాటి చినుకులకూ వీళ్లు భయపడుతుంటారు.**

**ఓంబ్రోఫోబియా** బాధితులు తమకు వర్షం ఏదో ఒక హాని కలిగిస్తుందని భావిస్తారు. వాన వల్ల విద్యుత్ అంతరాయాలు, దాంతో చీకట్లు, వరదలు, కొండచరియలు విరిగిపడటం, ఆమ్ల వర్షాలు, వర్షంతో వచ్చే సూక్ష్మక్రిముల గురించీ ఆందోళన చెందుతారు. వానకాలం ప్రారంభమైన నేపథ్యంలో.. ఓంబ్రోఫోబియా బాధితులు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

**కారణాలు:** 'ఓంబ్రోఫోబియా'కు నిర్దిష్ట కారణాలు లేవు. కానీ, వర్షం వల్ల కలిగిన కొన్ని భయంకరమైన అనుభవాలు.. కొందరిని వర్షం అంటే భయపడేలా చేస్తాయి. వరదల్లో ఆత్మీయులను కోల్పోయిన వాళ్లలో.. భయంకరమైన తుఫాను, వరదల నుంచి బయటపడిన వ్యక్తుల్లో కలిగే భయం.. క్రమంగా ఓంబ్రోఫోబియాగా మారుతుంది. కొందరిలో ఈ ఆందోళన పుట్టుకతోనే వస్తుందట. ఇలాంటివారిలో వర్షం పడుతున్నప్పుడు తీవ్రమైన భయం, ఆందోళన, విపరీతంగా చెమటలు పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం, వణుకు పుట్టడం, తలతిరగడం, నోరు ఎండుకపోవడం, వికారం, వాంతులు, విరేచనాలు లాంటి లక్షణాలు కనిపిస్తాయి.



**జాగ్రత్తలు :** ఓంబ్రోఫోబియా బాధితులు.. వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. స్థానిక వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. బయటికి వెళ్లేటప్పుడు వాతావరణ సూచనలను గమనించాలి. ముఖ్యంగా, వర్షం వచ్చే అవకాశం ఉంటే.. బయటికి వెళ్లకుండా ఉండాలి. ఇక తేలికపాటి లక్షణాలు ఉంటే.. చికిత్స అవసరం లేకపోవచ్చు. కానీ, తీవ్రంగా ఉంటే చికిత్స తీసుకుంటేనే మంచిది. ఇలాంటి బాధితుల్లో కాగ్నిటివ్-బిహేవియరల్ థెరపీ, ఎక్స్‌పోజర్ థెరపీ, హిప్నోథెరపీతో వర్షం అంటే భయం తగ్గించేలా చేయొచ్చని మానసిక నిపుణులు చెబుతున్నారు. పలు రకాల మందులతోపాటు ధ్యానం, యోగాతోనూ 'ఓంబ్రోఫోబియా' నుంచి బయటపడొచ్చు.